# ప్రతి మనిషీ దైవమే!

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబు నందణగె సర్వసృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య**

ఇది తెలిసినవారే నిజమైన యోగులు. ఈ జగత్తులో జీవించే ప్రతి జీవికూడను సత్యమునుండి ఆవిర్భవించినటువంటిదే! సత్యము లేకుండా ఏమీ జరుగదు. ఆ సత్యం ఒక్కరిదగ్గరనే ఉన్నది .... అది ఈ 'సత్యం' దగ్గరనే (అంటూ భగవాన్ తమ దివ్యహస్త చాలనంతో ఒక సువర్ణ లింగాన్ని సృష్టించారు) 'శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య'. ఇది శుద్ధ సత్త్వము. ఇంకెవరైనా ఈ శుద్ధసత్త్వమును నిరూపించ గలరా? సత్యము ఎక్కడ చూసినా ఉన్నది. మీరు సత్యాన్ని తలుచుకున్నప్పుడు, సత్యాన్ని చింతించినప్పుడు మీలో కూడా అది ఆవిర్భవిస్తుంది. కనుక, సత్యాన్ని మీరు నిరంతరం స్మరిస్తూ ఉండండి.

ఎందుకోసం ఈ దేహానికి 'సత్యసాయి' అని పేరు పెట్టారు? సత్యమే ఈ సాయినుంచి ఆవిర్భవిస్తున్నది. ఎవరు హృదయంలో సత్యాన్ని తలుచుకుంటూ ఉంటారో వారిలో 'సత్యం' ఉన్నాడు. సత్యాన్ని ఎప్పుడూ మరువకూడదు. సత్యముయొక్క ప్రతిబింబము, ప్రతిధ్వని, ప్రతిచర్యయే ధర్మము. 'సత్యాన్నాస్తి పరో ధర్మః' మనము లౌకికంగా ఎన్నియో విద్యలు నేర్చుకుంటున్నాము. కాని, ఇట్టి చదువు నిజమైన విద్య కాదు. నిజమైన విద్య ఏమిటంటే హృదయమునుంచి ఆవిర్భవించే సత్యమే! సత్యమునకు ఏది రూపము? What is the form of Dharma? (ధర్మమునకు ఏది రూపము?) శాంతికి ఏది రూపము? ఇవన్నీ రూపరహితమైనవి. మన హృదయంలోనే అంతర్భూతమైయున్న వీటిని బయటికి తీయాలి.

srisathyasaivachanamrutam

**నిన్ను నీవు దైవంగా భావించుకో!**

మానవునియందు లేనటువంటి శక్తులు మరి ఏ జీవియందూ లేవు; ఏ దేవునియందూ లేవు. కనుక, మనిషినే దైవంగా భావించుకోవాలి. "దైవం మానుష రూపేణ". కాని, మీరు మనిషిని మనిషిగా భావిస్తున్నారు. అందువల్లనే ఇన్ని తప్పులు చేస్తున్నారు. నీవు మానవుడవు కాదు. You are God (నీవే దైవం). "యద్భావం తద్భవతి". నీవు చెడ్డను తలుచుకుంటే నీకన్నీ చెడ్డ తలంపులే వస్తుంటాయి. నిన్ను నీవు దైవంగా భావించుకో. నీవు తప్పక దైవానివవుతావు. అందరూ భగవత్స్వరూపులే! అన్ని దేహములందుకూడను ఉన్నటువంటి దైవము ఒక్కడే. "ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి". ప్రతి ఒక్కరినీ మనము ప్రేమించాలి. Love All, Serve All. ఎందుకోసం మనగా అందరియందు దైవమే ఉన్నాడు. దైవము లేని స్థానమే లేదు ... ఆకాశమునందున్నాడు; జలము నందున్నాడు; శబ్దమునందున్నాడు; వెలుగునందు ఉన్నాడు. ప్రతి ఒక్కటీ దైవమే. ఇట్టి దైవాన్ని మనము వదలిపెట్టి ఏదో కట్టిన దేవాలయాలలో పెట్టిన విగ్రహాలను పూజించుకుంటూ కూర్చుంటున్నాము. దేవాలయాలలో ఉన్న విగ్రహాలను పూజించుకోండి, తప్పు లేదు. అయితే, ఆ విగ్రహాలలో ఉన్న దేవుడే అందరిలోనూ ఉన్నాడని గుర్తించండి. మీరు పూజించడం తప్పని నేను చెప్పను. కాని, నిజంగా నీవే దైవానివి. నిన్ను నీవు దైవంగా భావించుకొని అన్నింటియందు దైవమున్నాడని విశ్వసించు, తప్పు లేదు.

దేహమే ఒక దేవాలయము. ఈ దేవాలయంలో 'ఎనర్జీ' (శక్తి) అనేది ఒకటున్నది. దీనిని ఉపయోగించడంలో మనము కొంత 'డిస్క్రిమినేషన్' (విచక్షణ) ఉపయోగించాలి. ఈ 'ఎనర్జీ' దైవమా? లేక 'ఎనర్జీ'ని నింపుకున్నటువంటి దేహము దైవమా? ఈ దేహముకూడను దైవమే. ప్రతి ఇంచియందు, ప్రతి అణువునందు, ప్రతి కణమునందు దైవమున్నాడు. కనుక, దైవాన్ని మీరు మరువకండి. మిమ్మల్ని మీరు మరచినా దైవాన్ని మరచినట్లే. కనుక, మిమ్మల్ని మీరు మరువకూడదు. దీనిని పురస్కరించుకొనియే Always Be Careful అన్నారు. ఇదే ABC of life. మీరు నిరంతరం జాగ్రత్తగా ఉండాలి. 'నేను దైవాన్ని స్మరిస్తున్నానా లేక మరచిపోతున్నానా?' అని నిమిష నిమిషమునకూ మీరు హృదయ పరిశీలన చేసుకోవాలి.

sri sathyasai vachanamrutam

'నేను దేహము కాదు. నేను నేనే' అన్న భావము మీలో నిల్చాలి. అప్పుడు ఇతరులపై మీకు ఏవిధమైన దుర్భావములూ రావటానికి వీలుకాదు.

**మీ అందరియందు నేనే ఉన్నాను**

దైవము అందరియందు ఉంటున్నాడు. ఈ జగత్తులో అన్ని శిరస్సులుకూడను దైవముయొక్క శిరస్సులే! కనుకనే, దైవమును విరాట్స్వరూపుడన్నారు. మన కంటికి కనిపించేదంతయు భగవంతునియొక్క విరాట్స్వరూపమే (Cosmic Form). ఒక్కొక్క రూపము ఒక్కొక్క రకమైనదిగా ఉన్నది. కాని, ప్రతి రూపమునందు దైవమున్నాడు. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః". మీ అందరియందు నేనే ఉన్నాను. నేను వేరు, మీరు వేరు కాదు. Bhagavan is not different from you (భగవాన్ మీకంటే ప్రత్యేకంగా లేరు). నేను మీరే, మీరు నేనే. కనుక, మీరు ఏవిధమైన భేదభావములకూ అవకాశ మివ్వకండి. ప్రేమ ఒక్కటి మాత్రము బలపరచుకోండి. మీ హృదయంలో ప్రేమ అనే ఫలాన్ని చక్కగా పరిపక్వం గావిస్తే అందరికీ దీని మధుర రసాన్ని పంచవచ్చును. మొట్టమొదట మీ హృదయంలో ప్రేమను పరిపక్వం గావించాలి. మీ హృదయాన్ని ప్రేమమయం గావించినప్పుడు సర్వులుకూడను ప్రేమమయమైపోతారు. అప్పుడు ఎవ్వరినీ మనం ద్వేషించము, హింసించము. ఈనాడు ఎక్కడ చూసినను ద్వేషము, ద్వేషము, ద్వేషము! ఒకరికొకరికి మధ్య అభిప్రాయ భేదములు! అయితే, లౌకిక దృష్టిలో భేదములు కనిపించవచ్చును. కాని, ఆధ్యాత్మిక దృష్టిలో అందరూ ఒక్కటే. ఈ జగత్తులో అన్నీ జీరోలే. భగవంతుడు ఒక్కడు మాత్రమే హీరో. తాను ఒక్కడే – 'ఏకం సత్'. ఆ 'ఒకటి'వల్లనే ఈ 'జీరో'లకు విలువ వస్తున్నది. కనుక, భగవంతుడే మనకు ప్రధానము. మన కష్టసుఖములకు, విచారమునకు, దుఃఖమునకు మనస్సే కారణము. ఆనందాన్ని అందించేదీ మనస్సే; దుఃఖమును, విచారమును అందించేదికూడా మనస్సే. మైండును చాలామంది చెడ్డదిగా భావిస్తున్నారు. మైండును మనము సరియైనరీతిలో పెట్టుకున్నప్పుడు అది ఏమాత్రము చెడ్డను అందించదు. మైండునుకూడా దైవముగా భావించండి. అప్పుడు మీరు ఎల్లప్పుడు ఆనందంగా ఉంటారు.

srisathyasaivachanamrutam

**నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షిభూతం...**

అదే ఆత్మ. ఆత్మ అన్నా, మనస్సన్నా, కాన్షియస్‌నెస్ అన్నా అన్నీ ఒక్కటే. కాని, కొన్నికొన్ని పేర్లు మనము ప్రత్యేకంగా పెట్టుకుంటున్నాము. ఇవి కేవలం గుర్తుకోసం పెట్టుకున్నవేగాని సత్యాన్ని నిరూపించేవి కావు.

**ముక్తి కావాలంటే 'నేను ఆత్మను' అని విశ్వసించండి**

ఈ దేహానికి 'సత్యం' అని పేరు పెట్టారు. పేరు దేహానికి పెట్టారేగాని నాకు పెట్టలేదు. నేను దేహమును కాను. I am not the body, I am not the mind, I am not the Buddhi, I am not the Chitta, I am not imagination. Bhagavan is Bhagavan (నేను దేహమును కాను, మనస్సును కాను, బుద్ధిని కాను, చిత్తమును కాను, ఊహా కల్పితమును కాను. నేను నేనే). మీరందరుకూడను ఆ విశ్వాసాన్ని దృఢంగా పెట్టుకోవాలి. కాని కొంతమందికి ఆహార విహారములచేత, సంగదోషముచేత మనస్సులు కొంతవరకు మారుతుంటాయి. Tell me your company, I shall tell you what you are. నువ్వు ఎలాంటివారితో సహవాసం చేస్తావో నీవు అలాంటివాడవుగా తయారవుతావు. కనుక, నీవు సత్సంగంలో చేరు.

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః**

ఐతే, ముక్తి ప్రతి ఒక్కరికీ వస్తుంది. కాని, ఎప్పుడు? 'నేను ఆత్మను' అనే విశ్వాసాన్ని దృఢపరచుకున్నప్పుడు నీకు ముక్తి ఒక్క క్షణంలో వచ్చేస్తుంది. 'స్వామి నాలోనే ఉన్నాడు. నేనే స్వామిని' అని తలుచుకో. కాని, చంచల మనస్సుతో "నేనే స్వామిని, నేనే స్వామిని" అనుకుంటే ప్రయోజనం లేదు. స్థిరమైన మనస్సుతో 'నేనే స్వామిని, I am God (నేనే దైవాన్ని)' అనుకోవాలి. ఆవిధమైన స్థిరబుద్ధిని ఎప్పుడు సాధిస్తావో అప్పుడే నీవు 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం'

sri sathyasai vachanamrutam

అయినటువంటి దైవత్వాన్ని పొందుతావు.

**చిత్తశుద్ధియే జ్ఞానసిద్ధి**

మనస్సులో మాలిన్యం ప్రవేశించిందంటే అన్నీ చెడిపోతాయి. ఇప్పుడు పొల్యూషన్ (కాలుష్యం)వల్ల వాటర్‌కూడా చెడిపోయింది. మనస్సులో మాలిన్యం తొలగిపోవాలంటే దీనికి తగిన ట్రీట్‌మెంటు భగవన్నామ స్మరణమే! వాటర్ పొల్యూషన్‌వల్ల దేహము అనారోగ్యానికి గురి అవుతుంది. దేహాన్నికూడను మనము కొంతవరకు కాపాడుకోవలసిందే! ఈ దేహాన్ని నీకు ఎందుకోసం ఇచ్చాడు భగవంతుడు? నిన్ను నీవు తెలుసుకొనే నిమిత్తమై ఇచ్చాడు. కాని, అది నీవు మరచిపోయి నీ మనసంతా దేహంపైనే పెడుతున్నావు. దేహంలో ఏముంది! Body is like a water bubble. Mind is like a mad monkey. Don't follow the body, don't follow the mind. Follow the conscience (దేహమొక నీటిబుడగ వంటిది. మనసు ఒక పిచ్చికోతి వంటిది. కాబట్టి, దేహాన్ని, మనస్సును అనుసరించకండి. అంతరాత్మను అనుసరించండి). అది నేర్చుకుంటే మీరు ఎంతైనా ధన్యులైపోతారు. చిత్తశుద్ధియే జ్ఞానసిద్ధి. చిత్తము పరిశుద్ధంగా ఉండినప్పుడే జ్ఞానము సిద్ధిస్తుంది. కాబట్టి, మనస్సును పవిత్రంగా పెట్టుకోండి. మనసులో ఎలాంటి చెడ్డ భావాలు వచ్చినప్పటికినీ "ఇది మంచిది కాదు, ఇది నాకు సంబంధించినది కాదు" అని వాటిని ప్రక్కకు నెట్టేయాలి. "ఇవన్నీ నా సొత్తులు కావు. సదాలోచనలు, సద్భావములు... ఇవే నా ప్రోపర్టీలు" అని భావించాలి. ప్రేమ... ప్రేమ... ప్రేమ... ప్రేమయే దైవం. ప్రేమలో జీవించండి. అప్పుడు మీకు అన్నివిధాలుగా మంచే జరుగుతుంది.

**సత్యాన్ని దర్శించాలంటే పదకొండు సెకెన్లు చాలు!**

ఇప్పుడు ఇక్కడున్నటువంటి మీలో ఎంతమందికో ఎన్ని భ్రాంతులో, ఎన్ని భ్రమలో ఉన్నాయి. అయితే, మీరు పరిశుద్ధ హృదయులే. మీలో పవిత్రమైన భావాలున్నాయి. కాని, అప్పుడప్పుడు కొంత మాలిన్యం వచ్చి చేరుతుంటుంది. అది చేరకుండా చూసుకోవాలి. అదే మీ సాధన. నిజంగా సాధన అంటే ఏమిటి? కూర్చొని జపధ్యానములు చేయటం కాదు. ధ్యానమంటే ఏమిటనుకున్నారు? ఏదో దైవనామాన్ని తల్చుకుంటూ కూర్చోవడం అనుకుంటున్నారు. కాదు, కాదు. మీలో ఉన్నటువంటి పవిత్రమైన భావాన్ని తలుచుకుంటూ రావాలి. మీ సత్యాన్ని మీరు తలుచుకుంటూ రావాలి. నిజంగా మీకు మర్మము చెప్పాలంటే

srisathyasaivachanamrutam

ఎంతో సూక్ష్మంగా చెప్పవచ్చు. ఒక పదకొండు సెకెన్లు మీరు మనస్సు నిల్పుకోండి. ఆ పదకొండు సెకెన్లలోపలనే మీకు తప్పకుండా 'రియలైజేషన్' వస్తుంది. గడియారం మాదిరి మనస్సు తిరుగుతూ ఉంటే అది మెడిటేషన్ అనిపించుకోదు. పదకొండు సెకెన్లు మీరు తల్చుకుంటే చాలు. కాని, ఆ పదకొండు సెకెన్లుకూడను మీరు తల్చుకోవడం లేదు. ఈ పదకొండు సెకెన్లలో ఎంతనో సాధించవచ్చు. కనుక, సాధన పేరుతో మీరు అనవసరమైన శ్రమలకు గురి కాకండి. మీరు దేహాన్ని చాలా శ్రమ పెడుతున్నారు. కాలాన్ని, డబ్బునుకూడా వ్యర్థం చేస్తున్నారు. కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితమే వ్యర్థ మవుతుంది. కాబట్టి, టైమ్ వేస్ట్ చేయకండి. Time is God. God is time. కనుక, మీకు ఎప్పుడు టైమ్ చిక్కినా స్వామిని తలుచుకోండి. అప్పుడు నేను తప్పక మీకు కనిపిస్తాను. మీకు కనిపించడమే కాదు, మీతో సంభాషణకూడా చేస్తాను. స్వామికి ఎన్నో జాబులు వస్తున్నాయి, 'నిన్న స్వామి వచ్చి నాతో మాట్లాడినారు' అని వ్రాస్తున్నారు. మీరుకూడా ఆవిధమైన నమ్మకాన్ని భద్రంగా పెట్టుకోండి. తప్పక మీకు జయము కలుగుతుంది.

మీరందరూ భక్తులుగానే వచ్చారు. మీ అందరిలోనూ భక్తి ఉంది. కాని, భక్తియొక్క గుర్తును మీరు కనుక్కోవడం లేదు. అసలు భక్తి అంటే ఏమిటి? నమ్మకాన్ని గట్టిగా పెట్టుకోవాలి. విశ్వాసమెక్కడో అక్కడే ప్రేమ. ప్రేమ ఎక్కడో అక్కడే సత్యము. ఎక్కడ సత్యమో అక్కడే దైవం. Truth is God. సత్యమే మీకు దైవంగా ఉంటుంది. మీరు సత్యాన్ని గుర్తించాలంటే పదకొండు సెకెన్లు చాలు. పదకొండు సెకెన్లు మనస్సును సత్యంలో నిలుపండి, చాలు. పదకొండవ సెకెను లోపలనే చిక్కుతుంది మీకు ఆ దర్శనము. మీరు అనవసరంగా గంటలుగంటలు కూర్చొని కాళ్ళ నొప్పులు, చేతుల నొప్పులు, నడుం నొప్పులు వచ్చి చాలా బాధపడుతున్నారు. డాక్టర్లు ఇవి 'రుమేటిక్ పెయిన్స్' (వాతనొప్పులు) అంటారు. కాని, ఇవి 'రుమేటిక్ పెయిన్స్' కావు. దారి తప్పటంవల్ల వచ్చినటువంటి 'పెయిన్స్'. ఆ పదకొండు సెకెన్లలోనే దారి తప్పినారు. ఆ టైమ్ తప్పడంవల్లనే ఈ నొప్పులంతా వస్తున్నాయి. మీరు ఆ టైమ్ తప్పకుండా ఉండండి, ఏ నొప్పీ రాదు.

అంతేకాకుండా మీరు వేళకు సక్రమంగా భోజనం చేయండి. దీంట్లో కొన్ని సూక్ష్మమైన విషయము లున్నాయి. మాంసభక్షణ చేయకూడదు. చేపలు తినకూడదు. కాని,

విదేశీయులకు ఎక్కువగా మాంసాహారమే అలవాటు. కేన్సర్‌వంటి జబ్బులకు మాంసాహారమే కారణము. కాబట్టి, దానిని పూర్తిగా మానివేయండి. ఇంతేకాదు, వారికి cheese అంటే చాలా ఇష్టము. ఆ cheese ను మీరు ఎంత అధికంగా తీసుకుంటారో అంత బలహీనులైపోతారు. పాలు కూడా ఎక్కువగా తీసుకోకూడదు. మనం లిమిట్‌గా ఉండాలి. పాలు ఎంతనో అందులో నీరు అంత పోయాలి. పెరుగుకూడా అంతే. గట్టిగా ఉంటే 'చాలా మంచి పెరుగు' అంటారు. కాని, గట్టిగా ఉండకూడదు. అది కొంచెం నీళ్ళగానే ఉండాలి. ఈవిధముగా మనము ఆహారమునుకూడా కంట్రోలు చేసుకోవాలి. దైవప్రార్థనకు ఇది చాలా అవసరం. సరియైన ఆహారమును, ఈ క్రమశిక్షణను పెట్టుకుంటే మీకు దైవ దర్శనము తక్షణమే అవుతుంది. నెలలు, సంవత్సరాల తరబడి మీరు సాధన చేయనక్కర్లేదు. ఎప్పటికప్పుడే మీరు ఆనందంగా ఉండవచ్చు. ఆనందమనేది దైవముయొక్క స్వరూపమే!

**విషయ వాసనలు తగ్గించుకోవాలి**

'నాకు ఆనందం కావాలి' అని మీరనుకుంటారు. కాని, ఆనందం ఎక్కడినుండి వస్తుంది? ఏదైనా షాపునుండి కొనడానికి వీలవుతుందా? లేకపోతే ఏదైనా హోటల్‌కు వెళ్ళి భుజించటానికి వీలవుతుందా? కాదు. ఆనందము మీనుంచే రావాలి. ఆనందమే మీ స్వరూపము. పుట్టినప్పుడు మీరు ఆనందంగానే ఉన్నారు. కాని, తరువాత ఈ ప్రపంచముయొక్క వాసనలు తగిలి మీరు ఏడుపు ప్రారంభించారు. ఈ worldly attachments (విషయ వాసనలు) తగ్గించుకోవాలి. Less luggage, more comfort makes travel a pleasure. కాని, మీరు అనవసరంగా లేనిపోని attachments పెట్టుకొని, దేహాన్ని బలహీనం చేసుకొని విచారంలో మునిగిపోతున్నారు. ఈ విచారంకూడా చాలా చెడ్డది. Hurry, worry, curry (తొందరపాటు, విచారం, క్రొవ్వు పదార్థము)... ఈ మూడూ చేరేసరికి గుండె చాలా బలహీనమవుతున్నది. కనుక ఈ 'హర్రీ, వర్రీ, కర్రీ'లను దూరం చేసుకోండి. ఏదైనా కష్టం కలిగితే 'ఎట్లా వచ్చిందో అట్లే పోతుంది. నాకేమీ నష్టం లేదు' అనుకోండి. వచ్చినది ఏనాటికైనా పోతుంది. దేహాలుకూడా అంతే. కనుక, మనం

srisathyasaivachanamrutam

దేహాలతో ఎంతవరకు అవసరమో అంతవరకే సంబంధము పెట్టుకోవాలి. ఒక లిమిట్‌లో పెట్టుకొనకపోతే దేహం అనారోగ్యానికి గురి అవుతుంది. ఈవిషయంలో మీరు చాలా జాగ్రత్తగా మెలగాలి. సాధన చేసేటటువంటివాళ్ళు, దైవాన్ని చూడాలని, దైవంతో మాట్లాడాలని ఆశించేటటువంటివాళ్ళు నేను చెప్పినట్లు చేయండి. తప్పక మీరు దైవాన్ని చూస్తారు, దైవంతో మాట్లాడతారు.

భక్తి అనగా కేవలం పూజలు చేయడం, వ్రతాలు చేయడం, జపం చేయడం... ఇంతమాత్రమే కాదు. భగవంతునిపై చలించని, భ్రమించని ప్రేమయే నిజమైన భక్తి. దానికంటే మించినది మరొకటి లేదు. దేహమైనా మనం వదలిపెట్టవచ్చు గాని, ప్రేమను వదలిపెట్టకూడదు. నిజమైన ప్రేమ ఎప్పుడూ చలించనటువంటిది, భ్రమించనటువంటిది, నాశనము కానటువంటిది. అట్టి ప్రేమను మీరు భద్రంగా పెట్టుకోవాలి. అప్పుడు మీకు తప్పక దివ్యత్వము లభ్యమవుతుంది. కాని, మీరు ఈ లోకముతో అమితంగా సంబంధము పెట్టుకోవటంచేత ఈనాడు రాక్షసత్వము పెరిగిపోతున్నది. కామ, క్రోధములు రెండూ మానవునికి పరమ శత్రువులు. ఎప్పుడూ ప్రేమతో ఉండాలి. నవ్వుతూ ఉండాలి. కాని, కొంతమంది మొహం చూస్తే 'కేస్ట్రాయిల్ ఫేస్' మాదిరి కనబడుతుంది. ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. నవ్వుతూ ఉన్నప్పుడు ప్రేమ సహజంగానే వస్తుంది.

**ప్రేమను మించినటువంటి ఔషధం మరొకటి లేదు**

దైవం ఎల్లప్పుడు చిరునవ్వులు నవ్వుతుంటాడు. విచారము, దుఃఖము అనేవి దైవానికి ఏమాత్రము లేవు. నన్ను చూడండి - నేను నిరంతరం చిరునవ్వులు చిందిస్తుంటాను. నాకు ఎట్టి బాధలూ లేవు. ఏదో పిల్లలు చేసిన పొరపాటువల్ల ఈ కాలుకి దెబ్బ తగిలింది. తుంటి ఎముకకు నాలుగు cracks వచ్చాయి. డాక్టర్లు వచ్చి ఏమేమో బేండేజిలు కట్టాలన్నారు. నేను అంగీకరించలేదు. ఆ స్థితిలోకూడా నేను నడుచుకుంటూనే వచ్చి పైనుంచి అందరికీ దర్శనమిచ్చాను. ఇప్పుడు ఒక కాలుకంటే మరొక కాలు రెండించిలు తగ్గింది. అమెరికానుండి, ఇంకా ఎక్కడెక్కడినుండో ఎంతోమంది డాక్టర్లు, స్పెషలిస్టులు వచ్చారు. సింగపూర్‌నుండి డాక్టర్ పిళ్ళై, ఆయన కొడుకుకూడా వచ్చారు. "స్వామీ, ఐదు నిమిషాలు

srisathyasaivachanamrutam

మాకివ్వండి" అన్నారు. "మీకు ఆధ్యాత్మికంగా కావలిస్తే ఐదు గంటలిస్తాను. కాని, ఈ శరీరాన్ని ఐదు నిమిషాలుకూడా ఇవ్వను" అన్నాను. నాకు ఒక చిన్న నొప్పిగాని, నరములయొక్క బాధగాని ఏమాత్రము లేవు. సహజంగా నేను నడుస్తాను. అప్పుడు ఎంత బరువు ఉండినానో అంత బరువే ఇప్పుడుకూడా ఉన్నాను. అప్పుడు ఈ దేహముయొక్క బరువు 110 పౌండ్లు. ఇప్పుడుకూడా 110 పౌండ్లే! ఒక సగం పౌండైనా తగ్గలేదు, సగం పౌండైనా పెరగలేదు. నేను ఎప్పుడూ ఆరోగ్యంగానే ఉన్నాను. నా విషయమై మీరెవ్వరూ బాధపడనక్కర్లేదు. బాహ్యంగా చూస్తే 'స్వామికి చాలా నొప్పిగా ఉందేమో' అని మీరు అనుకుంటారు. No pain! మీ ప్రేమయే నా నొప్పినంతా పరిహారం చేస్తుంది. మిమ్మల్ని చూస్తే చాలు, నాకెంతో ఆనందం కలుగుతుంది. మీతోనే నాకు నొప్పి పోవలసిందేగాని డాక్టర్స్‌తో కాదు. ఈనాడు ఇంతమంది ఈ ప్రదేశానికి చేరటం చూస్తుంటే... ఇంతమంది ప్రేమకు నేను పాత్రుడనైనాను కదా అని నాకెంతో ఆనందంగా ఉన్నది. ఇక్కడే కాదు, ఎక్కడైనా సరే, మీరు హ్యాపీగా ఉండండి. నేను ఎప్పుడూ హ్యాపీగానే ఉంటాను. మిమ్మల్ని చూస్తుంటేనే నాకెంతో ఆనందం కలుగుతోంది. ఇది మీ అదృష్టము. మీరందరూ చాలా భక్తితో, ప్రేమతో వచ్చారు. అందువల్ల రేపటినుంచి మీమధ్యకు నడుచుకుంటూ వచ్చి దర్శనమివ్వాలని నాకెంతో ఉత్సాహం కలుగుతోంది. ప్రేమను మించినటువంటి ఔషధం మరొకటి లేదు. మీ ప్రేమయే నాకు ఔషధం. అది చాలా శక్తిమంతమైనది. అదేవిధంగా, నా ప్రేమయే మీ అందరికీ దివ్యౌషధం. మీరు నిరంతరం సుఖశాంతులతో ఉండండి. ఒకే కుటుంబంలోని సభ్యుల మాదిరి అన్యోన్యంగా, ఆనందంగా జీవించండి. చిన్నచిన్న బాధలకు మీరు లొంగిపోకండి. ఎటువంటి చింతలకూ చోటివ్వకండి. భార్యకు జబ్బు వచ్చినా, బిడ్డలకు జబ్బు వచ్చినా ఆందోళన చెందకండి. తప్పక అంతా బాగుంటుందన్న విశ్వాసంతో మీమీ ఇళ్ళకు తిరిగి వెళ్లి సుఖశాంతులతో జీవించండి. (స్వామి తాము సృష్టించిన లింగాన్ని చూపిస్తూ....) దీనిని అందరూ చూశారా? చాలా బరువుగా ఉంది. శివరాత్రినాడు దీనికంటే పెద్దది వస్తుంది గొంతునుంచి.

**(ప్రపంచ యువజన సమ్మేళనం ముగింపు, తేదీ 28.7.2007, సాయికుల్వంత్ సభామండపం)**

srisathyasaivachanamrutam